## క్లుప్తంగా

### నేడు హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

**ఆసిఫాబాద్అర్బన్:** కార్మిక శాఖ సీఎస్ఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీపీ, షుగర్‌లతో పాటు 32 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి వారం రోజుల్లోగా రిపోర్టులు అందజేస్తామన్నారు. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం

**జైనూర్:** ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన సంప్రదాయ చిత్రకళా ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న మడావి ఆనంద్‌రావును రాసిమెట్ట ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులతో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ గుస్సాడీ, డప్పు, తుడుం కొడుతున్న తాతల చిత్రాలను చిత్రీకరించి తన చిత్రకళా ప్రతిభను చూపి భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**ఆసిఫాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు లింగమూర్తి, పవన్, శైలేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

**జైనూర్:** మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు సేవ చేయడమే రాణి దుర్గావతి మహిళా ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ లక్ష్యమని అధ్యక్షురాలు గోడం జంగుబాయి అన్నారు. శనివారం సిర్పూర్(యూ) మండలంలోని పుల్లార గ్రామంలో నిరుపేదలకు చలి నుంచి ఉపశమనం కలిగించేందుకు దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులకు, గృహిణులకు సేవ చేయడమే రాణి దుర్గావతి మహిళా ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అనక రాంబాయి, ఆత్రం తీర్థబాయి, కుమ్ర రాధాబాయి, కుమ్ర అనుసయ, తదితరులు ఉన్నారు.

### మట్కా ఆడుతున్న వ్యక్తిపై కేసు

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాడానగర్ సమీపంలో శనివారం ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న షహబాజ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. షహబాజ్ వద్ద రూ.1500 నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో మట్కా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం రెవెన్యూ అధికారులు రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. డీసీఎం వ్యానులో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి స్వాధీనపర్చుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి పట్టుకున్న వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**నార్నూర్:** మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జాదవ్ కాజల్ అనే గిరిజన విద్యార్థిని ఈనెల 15 నుంచి ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 68వ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, పీడీ అడే విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈనెల 1న కుమురం భీం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ వనిత, ఉపాధ్యాయులు నిలయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల చదువుకు దూరం

- చినరాస్పెల్లిలోని గురుకులం కాగజ్‌నగర్‌లో కొనసాగింపు
- 2019లో దహెగాం మండలానికి మంజూరు
- స్థలం లేక కాగజ్‌నగర్‌కు తరలించిన అధికారులు
- వసతిగృహం సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్న స్థానిక విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కాగజ్‌నగర్‌లో కొనసాగుతున్న మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాల

**దహెగాం:** గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మండలంలోని చినరాస్పెల్లిలో మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. అప్పటి ప్రజాప్రతినిధులు పాఠశాల ఏర్పాటుకు చినరాస్పెల్లిలో కొబ్బరికాయ సైతం కొట్టారు. కాని అది స్థానిక నాయకుల పట్టింపులేని కారణంగా కాగజ్‌నగర్‌కు తరలిపోయింది. దీంతో ఇక్కడి పేద విద్యార్థులు గురుకుల చదువుకు దూరమయ్యారు.

**2019లో ఏర్పాటు..**

గత ప్రభుత్వం 2019లో మహాత్మ జ్యోతి బాపూలే విద్యాలయాన్ని మండలంలోని చినరాస్పెల్లిలో ఏర్పాటు చేసింది. మండలంలో ప్రభుత్వం స్థలం లేకపోవడం.. ప్రైవేటు భవనాలు సైతం అందుబాటులో లేకపోవడంతో గురుకులాన్ని కాగజ్‌నగర్‌కు తరలించి అక్కడ ప్రారంభించారు. కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతి బాపూలే గురుకులానికి చినరాస్పెల్లి బోర్డును ఏర్పాటు చేశారు. దహెగాం మండలంలో కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. కేజీబీవీలో బాలికలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. బాలురు చదువుకోవడానికి హాస్టల్ వసతి కలిగిన పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఎస్సీ హాస్టల్ సైతం బెల్లంపల్లికి తరలింపు..**

మండల కేంద్రంలో గత ఐదేళ్ల క్రితం ఎస్సీ హాస్టల్ ఉండేది. ఎస్సీ హాస్టల్‌కు పక్కా భవనం లేక అద్దె భవనంలో కొనసాగించారు. క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో హాస్టల్‌ను దహెగాం నుంచి ఎత్తివేశారు. దీంతో పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎస్సీ హాస్టల్‌ను ఎత్తివేసినా మహాత్మ జ్యోతి బాపూలే విద్యాలయం మండలానికి మంజూరు కావడంతో ఇక్కడి విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకోవచ్చని ఆశించారు. కానీ దాన్ని కూడా కాగజ్‌నగర్‌కు తరలించడంతో ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అద్దె భవనంలోనే కొనసాగింపు..

మహాత్మజ్యోతి బాపూలే గురుకుల విద్యాలయం కాగజ్‌నగర్ పట్టణంలో కూడా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. పాఠశాలలో 5 నుంచి 10 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 400 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్నందున నెలకు అద్దె రూ. లక్ష ప్రభుత్వం చెల్లిస్తుంది. గురుకులంలో ఇంటర్ సైతం ఉండడంతో అద్దె భవనంలో సౌకర్యాలు సరిపోక ఇంటర్ విద్యార్థులను ఆసిఫాబాద్ ఎంజేపీకి తరలించారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మజ్యోతి బాపూలే విద్యాలయంలో సరైన సౌకర్యాలు లేవని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి చినరాస్పెల్లి మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల విద్యాలయాన్ని దహెగాం మండలంలోనే కొనసాగించాలని మండల వాసులు కోరుతున్నారు.

### ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..



దహెగాం మండలానికి మంజూరైన మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల మండలంలోనే కొనసాగడం న్యాయం. మండలంలో ప్రభుత్వం స్థలం గుర్తించి గురుకులాన్ని దహెగాంకు తరలించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. పక్కా భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే

## భక్తిశ్రద్ధలతో 'కార్తిక' పూజలు





కార్తిక మాసం పురస్కరించుకొని పల్లెలు, పట్టణాల్లోని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయంలో కాకడ హారతులు, భజనలు కొనసాగుతున్నాయి. మహిళలు, పురుషులు, చిన్నారులు అనే తేడా లేకుండా ఉదయాన్నే శివాలయానికి చేరుకుంటున్నారు. సుమారు గంట సేపు దేవుని లీలాగానంతో భజనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళహారతులు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తీర్థ ప్రసాదాలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారు.

– కెరమెరి





# సైన్స్‌పై పట్టు సాధించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**కౌటాల:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా శనివారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనాసక్తిని పెంపొందించుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను మండల స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న మండలస్థాయి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. జన విజ్ఞాన వేదిక సమన్వయకర్త ఉప్పుల నరసింహాచారి, ఉపాధ్యాయులు రాంచందర్, శ్యాంరావు, రమేశ్, సత్యనారాయణ, శివాజీ, కవిత, సంధ్యారాణి, యేసుమణి, తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

**కాగజ్‌నగర్‌రూరల్:** కాగజ్‌నగర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మూడు మద్యం దుకాణాలతో పాటు స్టేషన్‌పరిధిలోని మరికొన్ని మద్యం షాపుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. కల్తీ మద్యం నివారణ, నిబంధనలకు అనుకూలంగా మద్యం విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు వాటిని అమలు చేయడానికి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవిని సంప్రదించగా, నిరంతర తనిఖీల్లో భాగంగానే స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కాగజ్‌నగర్ అబ్కారీ స్టేషన పరిధిలోని పలు ప్రాంతాల్లో మద్యం షాపుల్లో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# తప్పనిసరిగా టీకాలు తీసుకోవాలి



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

**వాంకిడి:** గర్భిణీలు, చిన్నపిల్లలు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలని హెచ్ఈవో పెందుర్ రవిదాస్ సూచించారు. శనివారం మండలంలోని రాజులగూడ గ్రా మంలోని పాఠశాలలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత పెరుగుతున్నందున చిన్నపిల్లలు, వృద్ధులు, అస్తమా, దగ్గు, దమ్ము ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని, చలికి బయట ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సున్న, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఆశ పార్వతి పాల్గొన్నారు.

# రుద్రాపూర్‌లో సప్తాహం



మంగళహారతులతో మహిళలు

**చింతలమానెపల్లి:** మండలంలోని రుద్రాపూర్ గ్రామంలోని ఆంజనేయ ఆలయంలో సప్తాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిరోజు శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళహారతులతో ఆలయంలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. లోక కళ్యాణం కోరుతూ పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వారం రోజుల పాటు కార్తీక పౌర్ణమి వరకు ప్రతీరోజు అన్న ప్రసాద వితరణ, వారం రోజుల పాటు కీర్తనల ఆలాపన నిర్వహిస్తామని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.

# దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారు, నిందితులతో పోలీసులు

**కౌటాల:** మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టుకున్నట్లు సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన పర్వతాల ప్రవీణ్, ఆటో డ్రైవర్ అగాడి కొండయ్య, కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి ఒడిల ప్రకాశ్‌లు చంద్రాపూర్ జిల్లా బంగారీతర్పిడికి వెళ్లి దేశీదారు కొనుగోలు చేశారు. నాటుపడవ ద్వారా నది మార్గాన తుమ్మిడిహెట్టికి తరలించారు. అక్కడి నుంచి ఆటోలో గూడెం మీదుగా గడ్చిరోలి జిల్లాలో అహేరికి తీసుకెళ్తుండగా పోలీసులకు పక్కా సమాచారం అందింది. తుమ్మిడిహెట్టి వద్ద రూ. 1.80 లక్షల విలువ గల 20 బాక్సుల దేశీదారును శనివారం ఎస్సై ఎస్.మధుకర్, పోలీసులు పట్టుకున్నారు. ఆటోతోపాటు దేశీదారును సీజ్ చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై ఎస్.మధుకర్ పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఇంటింటి సర్వే



దహెగాం: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్



రెబ్బెన: సర్వేను పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతి



పెంచికల్‌పేట్: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

**దహెగాం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇళ్లకు స్టిక్కరింగ్ పూర్తి చేశారు. శనివారం ఇంటింట చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ కవిత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సర్వేకు వచ్చిన వారికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్కు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

**సిర్పూర్(టి)లో..**

**సిర్పూర్(టి):** తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కుల గణన ప్రక్రియ శనివారం మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో ప్రారంభమైంది. అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్వే నిర్వహించారు. లక్ష్మీపూర్, టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణలు కుటుంబ సర్వేల వివరాలు పరిశీలించారు.

**ఆసిఫాబాద్ మండలంలో..**

**ఆసిఫాబాద్‌రూరల్:** కుటుంబ సమగ్ర సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలో ఎల్లారం, సాలేగూడతో పాటు పలు జీపీలో చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

**రెబ్బెన:** ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. మండలంలోని ఇందిరానగర్‌లో సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదును తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్న తీరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత గడువులోగా మండలంలో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు జరగకుండా అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శి నమ్రత తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ కాలనీలో సర్వేను పరిశీలించిన తహసీల్దార్..**

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను శనివారం తహసీల్దార్ పానకంటి రామ్మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించారు.

**పెంచికల్‌పేట్‌లో..**

**పెంచికల్‌పేట్:** మండలంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను శనివారం ఎంపీడీవో అల్బర్ట్, మండల విద్యాధికారి రమేశ్ బాబులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎస్‌వో దామోదర్ తదితరులు ఉన్నారు.

**వాంకిడిలో..**

**వాంకిడి:** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వేను మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా, ఇంటి యజమానులు ఇచ్చే సమాచారం ఆధారంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో శివచరణ్, ఎంపీవో జావిద్, తదితరులు పాల్గొన్నారు.

**చింతలమానెపల్లిలో..**

**చింతలమానెపల్లి:** మండలంలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ శనివారం ప్రారంభమైంది. ఎన్యూమరేటర్లు ఆయా గ్రామాలలో వివరాలు సేకరించారు. సూపర్‌వైజర్లు నిర్దేశించిన ప్రకారం ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు శనివారం విడతకు 8 కుటుంబాలను సర్వే చేయాలని మండలంలో నిర్దేశించారు. చింతలమానెపల్లి, బాలాజీఅనుకోడ, రవీంద్రనగర్ గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్న తీరును ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు.

**కెరమెరిలో..**

**కెరమెరి:** మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం తొలిరోజు 496 కుటుంబాలకు సర్వే పూర్తి చేశారు. 76 ప్రశ్నలతో కూడిన ప్రొఫార్మాను ఎన్యూమరేటర్లు పూరించారు. మండలంలోని మొత్తం 9933 కుటుంబాలకు 119 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు విధుల్లో ఉన్నారు. సర్వేను ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ పరిశీలించారు.

**కౌటాలలో..**

**కౌటాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీవో దత్తరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో హన్మంతు, డీటీ మస్కూర్ అలీ, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



వాంకిడి: సర్వే చేస్తున్న సిబ్బంది



చింతలమానెపల్లి: సూచనలు ఇస్తున్న ఎంపీడీవో



కెరమెరిలో..

### ఉపాధ్యాయుల సర్వే సమయాన్ని మార్చాలని ఎంపీడీవోకు వినతి

**జైనూర్:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబసర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయుల సమయసారిణిలో మార్పు చేయాలని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయులు ఓ పూట పాఠశాలల్లో విధులు నిర్వహించి మధ్యాహ్నం సర్వే చేపట్టేందుకు వెళ్తే ఇళ్లల్లో కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పంచాయతీ కార్మికులను ఎన్యూమరేటర్లకు సహాయకులుగా అందిస్తే సర్వే చేపట్టడానికి సులభతరమవుతుందని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆత్రం దత్తు, జాదవ్ శ్రీకాంత్, నిరంజన్, మీరా, లలిత, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.